క్లుప్తంగా

దోమల నివారణకు ఎబిట్ స్ప్రే

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో విపరీతంగా పెరిగిపోయిన దోమల నివారణకు పీహెచ్‌సీ, పంచాయతీల సంయుక్త ఆధ్వర్యంలో ఎబిట్ మందును ఇసుకపూడిలో స్ప్రే చేయించినట్లు హెల్త్ అసిస్టెంట్ వి.మురళి గురువారం తెలిపారు. ఇసుకపూడి మెయిన్, దాసరివారిపేట, నేలపూడివారిపేట, జక్కంశెట్టివారిపాలెంలో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వివరించామన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీసీఎస్‌ఓ ఉదయభాస్కర్

మామిడికుదురు: పాశర్లపూడి జెడ్పీ హైస్కూల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం అమలు తీరును జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి అడపా ఉదయభాస్కర్ గురువారం పరిశీలించారు. పోష్టికాహారంతో కూడిన భోజనాన్ని ప్రతి విద్యార్థి తినాలని సూచించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. జనరల్ నాలెడ్జ్, వర్తమాన విషయాలు, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. వినియోగదారుల హక్కుల గురించి వివరించి వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగోజీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన శ్రీనివాసరావు



మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం కలిశారు. మిథున్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గుండుగోలులో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఆయనతో పాటు నియోజకవర్గానికి చెందిన గుత్తుల నాగబాబు, కర్రి బాల సుబ్రహ్మణ్యం మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలపై సన్నాహక సమావేశం

అంబాజీపేట: స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 2025–26 క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓలు వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట మండల రీసోర్స్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలపై ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్, అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ, ఈనెల 18న బాలురు, 19న బాలికలకు అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగ క్రీడాంశాలలో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా అథ్లెటిక్స్ విభాగాల్లో కూడా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ ఆటల పోటీల్లో మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో ఎంపికైన వారిని డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని ఆదిలక్ష్మి తెలిపారు. హెచ్‌ఎంలు కదలి సాయిరాం, వరప్రసాద్, ఎమ్మెస్సార్ సీహెచ్ మూర్తి, వెంకట కేశవాచార్యులు, పీడీలు అందే సూర్యనారాయణ ముత్యాల కిషోర్, పెచ్చెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మృతి



యెనుముల చిట్టిబాబు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసు పాలెం వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు యెనుముల చిట్టిబాబు (62) గురువారం మృతి చెందారు.

సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల రైతులతో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘిస్తూ రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఓఎన్‌జీసీపై చేసిన ఫిర్యాదు పట్ల తహసీల్దార్ ప్రకాష్ బాబు స్పందించారు. రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. రైతులు తొందరపడి ఎలాంటి నిరసనలకు పాల్పడవద్దని సూచించారు. రైతులు బొబ్బా వెంకన్న, అల్లూరి సత్యనారాయణ, పెద్దబ్బు పాల్గొన్నారు.

విసిగివేసారి!

- వరదలకు మునిగిపోతున్న లోతట్టు రోడ్లు
- పరిస్థితులకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్త కాజ్‌వే నిర్మాణం
- రహదారుల ఎత్తు పెంచాలని డిమాండ్



టేకిశెట్టిపాలెం వద్ద గోదావరి పాయపై వరదలకు తగ్గట్టుగా నిర్మించిన కాజ్‌వే



అప్పనరామునిలంక- రామరాజులంక మధ్య వరదలో లోతట్టు ప్రధాన రహదారి (ఫైల్)

సఖినేటిపల్లి: వరదలు సంభవించినప్పుడు లోతట్టు ప్రాంతాలు, సాధారణ స్థాయిలో ఉన్న రోడ్లు మునిగిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంకకి వెళ్లే ప్రధాన మార్గంలోని గోదావరి పాయపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శిథిలమైన లోతట్టు కాజ్‌వే స్థానంలో కొత్తగా వరదలకు తగ్గట్టు కాజ్‌వే పూర్తి చేసింది. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీతోనే మునిగిపోతున్న లోతట్టు కాజ్‌వే స్థానంలో రూ.2 కోట్లతో కొత్తది పూర్తి చేయడం వారికి ఎంతో ఊరటనిచ్చింది. అయితే, ఈ కొత్త కాజ్‌వే మీదుగా ఇతర గ్రామాలకు వెళ్లే లోతట్టు రోడ్డు మార్గాలు మాత్రం ఇప్పటికీ అభివృద్ధి కాలేదు. దీంతో వరద నీటి మట్టం 11.75 అడుగులకు (మొదటి ప్రమాద హెచ్చరిక) చేరగానే రోడ్లు మూసుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



వరద నీటిలో టేకిశెట్టిపాలెం- అప్పనరామునిలంక మెయిన్ రోడ్డు (ఫైల్)

ముందుగానే రాకపోకలు బంద్

మొదటి వరద ప్రమాద హెచ్చరిక జారీతోనే గ్రామంలో లోతట్టుగా ఉన్న రోడ్లు మునిగి రాకపోకలు ముందుగానే బంద్ అవుతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల వారు టేకిశెట్టిపాలెం మీదుగా అప్పనరామునిలంకకు వెళ్లడానికి ఆస్కారం లేకుండా పోతోంది. అలాగే అప్పనరామునిలంక వాసులు బయటకు రావడానికి కూడా ఉండట్లేదు. వీరితో పాటు చించినాడ వంతెన మీదుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు ఇతర ఉమ్మడి జిల్లాల భక్తులు వరదల సమయాల్లో ఈ కాజ్‌వే మీదుగా ప్రయాణించి అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి లోతట్టు రోడ్లు అవరోధంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామస్తులు వరద నీటిలో నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు, రోజువారి పనులు నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, వైద్య సౌకర్యాలకు వెళ్లే రోగులు, విద్యార్థులు దారులు లేక ఇబ్బంది పడక తప్పట్లేదు.

రెండు వైపులా రోడ్లు ఎత్తు చేయాలి

అప్పనరామునిలంకకి రెండు వైపులా బాహ్య ప్రపంచంతో అనుబంధంగా ఉన్న ఆయా మార్గాల్లో రోడ్లు మరింత ఎత్తు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు దిగువన నుంచి కొత్తకాలువ ఏరియా సరిహద్దు వరకూ ఉన్న రోడ్డును 4 అడుగుల మేర ఎత్తు చేయాలని, అలాగే అప్పనరామునిలంక, రామరాజులంక మధ్యలోని మెయిన్ రోడ్డును 3 అడుగుల మేర ఎత్తు చేయాలని వారు కోరుతున్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రెండు రోడ్లు ఎత్తు చేయడం వల్ల వరదల సమయంలో మూడో ప్రమాద హెచ్చరిక స్థాయి వరకూ రాకపోకలకు రోడ్డు మార్గాలు అందుబాటులో ఉంటాయని గ్రామస్తులు చెబుతున్నారు.

ఇళ్లకు రెట్టింపు సాయం అందించాలి

ముంపు ప్రాంతాల్లో ఇంటి నిర్మాణం అధిక వ్యయంతో కూడుకొని ఉండడంతో వరదలు తట్టుకునే రీతిలో ప్రభుత్వం హౌసింగ్ స్కీంలో రెట్టింపు సాయం చేయాలని కోరుతున్నారు. అలాగే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చి ఎత్తు ఎక్కువలో ఉండేటట్టు చూడాలని, తాగునీరు సరఫరాకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పశుగణనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

లంక గ్రామాల్లో పాడి పరిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. వరద సమయంలో పశుగ్రాసం కొరత వేధిస్తోందన్నారు. గ్రామంలో పశుగణన మొక్కుబడిగా ఉండడంతో వరదల వల్ల నష్టపోతున్న తమకు న్యాయం జరగట్లేదన్నారు. మూగజీవాల లెక్కలు అరకొరగా ఉండడంతో వరదల అనంతరం ప్రభుత్వం నుంచి సరిపడా దాణా, ఎండు గడ్డి అందడం లేదన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

పూర్తిగా వరద ముంపు గ్రామం అయిన అప్పనరామునిలంకలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఇతర గ్రామాల కంటే ఈ గ్రామానికి ఎక్కువ నిధులు ఇవ్వాలి.

– వీరా మల్లిబాబు, ఎంపీపీ, సఖినేటిపల్లి.

రవాణాకు ఇబ్బందులు ఉండవు

ఏటా వచ్చే వరదలకు ముందుగానే మునుగుతున్న రోడ్లు ఎత్తు చేస్తే గ్రామస్తులకు ఊరట కలుగుతుంది. కొత్త కాజ్‌వే వరదలకు తగ్గట్టుగా ఉన్నా కూడా రోడ్లు ఎత్తుగా లేకపోవడంతో కాజ్‌వే మీదుగా రాకపోకలు బంద్ అవుతున్నాయి.

– ఇందుకూరి సుబ్బరాజు, సర్పంచ్, అప్పనరామునిలంక.

గ్రామంలో పశుగణన చేపట్టాలి

పశుగణన మొక్కుబడిగా సాగడంతో రైతులకు న్యాయం జరగడం లేదు. గ్రామంలో మూగజీవాల లెక్కలు పూర్తిస్థాయిలో లేవు. వరదలకు నష్టపోయే రైతులకు ప్రభుత్వ పశుగ్రాసం సాయం సరఫరాకు ఈ లెక్కలు సహకరించడం లేదు.

– చింతా శేషు, వైఎస్సార్ సీపీ యూత్ లీడర్, అప్పనరామునిలంక

రెట్టింపు రుణాలు ఇవ్వాలి

వరద ప్రభావిత ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులకు ఎంతో వ్యయంతో కూడుకొని ఉంటాయి. వరదలకు తగ్గట్టుగా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు రెట్టింపు లోన్‌లు ఇవ్వాలి.

– చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు, అప్పనరామునిలంక.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

ఆలమూరు: ప్రజలకు ఉపయోగం లేని యాప్‌లు ఉపసంహరించుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె తప్పదని గ్రామ సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో ఎంపీడీఓ రాజుకు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఐక్యవేదిక సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ, వరుస సర్వే పనులతో విసిగిపోయామన్నారు. సమయపాలన లేని వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, ఉద్యోగులందరికి జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం 15 రోజుల్లోపు పరిష్కరించకుంటే ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.



ఆలమూరులో ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగుల ఐక్యవేదిక



పి.గన్నవరంలో ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సర్వేల నుంచి విముక్తి కలిగించాలి

పి.గన్నవరం: ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలని కోరుతూ పి.గన్నవరం మండలంలో సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలపై ఎంపీడీఓకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర విలేజ్ వార్డు సెక్రటేరియట్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలన్నారు. సమయపాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కలించాలని డిమాండ్ చేశారు. కార్యాలయ పని వేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించడం, సెలవులు, పండగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయిస్తున్నారని వాపోయారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తదితర డిమాండ్లను ప్రధానంగా ప్రస్తావించారు.

శ్రీనివాసరావు పరామర్శ



బి.దొడ్డవరంలో వెంకటరత్నం కుటుంబీకులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామానికి చెందిన వాకపల్లి వెంకటరత్నం ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వెంకటరత్నం కుటుంబసభ్యులను వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పించారు. మృతుని సోదరుడు వాకపల్లి మంగయ్య, కుటుంబసభ్యులు వీరాస్వామి, రాంబాబులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నేతలు తోరం సూర్యభాస్కర్, జక్కంపూడి వాసు, గోపాలకృష్ణ, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, విత్తనాల శేఖర్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గానికి సముచిత స్థానం

కొత్తపేట: రాష్ట్ర వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీల్లో కొత్తపేట నియోజకవర్గానికి సముచిత స్థానం లభించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సారథ్యంలో జిల్లా పార్టీ అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ.. రాష్ట్రంలోనే ఉత్తమ జిల్లా పార్టీగా గుర్తింపు పొందింది. పార్టీ కోసం సైనికుల్లా పనిచేసే నాయకులను జగ్గిరెడ్డి గుర్తించి వివిధ పదవుల కోసం పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేశారు. ప్రస్తుతం వివిధ విభాగాలకు సంబంధించి అధిష్టానవర్గం 13 పదవులు ప్రకటించింది. ఆ జాబితాలో 8 పదవులు కొత్తపేట నియోజకవర్గానికి దక్కాయి. నాలుగు మండలాల్లో అన్ని సామాజికవర్గాలకు స్థానం కల్పించారు. రాష్ట్ర బూత్ కమిటీల విభాగం జనరల్ సెక్రటరీగా కొత్తపేట మండలం పలివెలకి చెందిన ఎంపీపీ మార్గన గంగాధరరావు, రాష్ట్ర ప్రచార విభాగం సెక్రటరీగా కొత్తపేటకు చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముసునూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీగా రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా రావులపాడుకు చెందిన కాళ్లకూరి హరినాథ్, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం సెక్రటరీగా రాజవరం మాజీ సర్పంచ్ కొల్లి శ్యాంసన్, రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీగా ఆత్రేయపురం మండలం తాడిపూడి గ్రామానికి చెందిన భూపతిరాజు శివసూర్యనారాయణరాజు (సుధీర్‌వర్మ), రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం జాయింట్ సెక్రటరీగా ర్యాలికి చెందిన పల్నాటి శామ్యూల్‌రెడ్డి జయపాల్ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ విభాగం సెక్రటరీగా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన నాంద్ర నాగమోహన్ రెడ్డి నియమితులయ్యారు.



మార్గన గంగాధరరావు



ముసునూరి వెంకటేశ్వరరావు



బొక్కా వెంకటలక్ష్మి



కాళ్లకూరి హరినాథ్



కొల్లి శ్యాంసన్



భూపతిరాజు సుధీర్‌వర్మ



పల్నాటి శామ్యూల్‌రెడ్డి జయపాల్



నాంద్ర నాగమోహన్‌రెడ్డి

పాఠశాలలను సందర్శించిన డీఈవో



నగరం స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బాషా

మామిడికుదురు: పదో తరగతి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో 100 శాతం మార్కులు సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈవో బాషా సూచించారు. ఆయన గురువారం నగరం జెడ్పీ హైస్కూల్‌తో పాటు ప్రధాన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పదో తరగతిలో సి, డి గ్రేడ్ విద్యార్థులపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వారి సామర్థ్యాలు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఇటీవల ఇచ్చిన మూల్యాంకనం పుస్తకాలను పరిశీలించారు. స్కూల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్‌ఎంలు సోమేశ్వరరావు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా సోమేశ్వరస్వామి కల్యాణం



ఈదరాడలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: ఈదరాడలో కొలువై ఉన్న ప్రసిద్ధి ఉమా సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజ్యం సుబ్బయ్య పర్యవేక్షణలో పలు ప్రత్యేక పూజలు జరిపించారు. దీనిలో భాగంగా స్వామి వారికి లక్ష మారేడు దళాలలతో బిల్వార్చన, గణపతి హోమం కన్నుల పండువగా జరిపించారు. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సంక్షిప్తంగా..

నేరేడిమిల్లికి ప్రజ్ఞా పురస్కార్ అవార్డు

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నేరేడిమిల్లి సత్యనారాయణ ఉపాధ్యాయ ప్రజ్ఞా పురస్కార్ అవార్డును గురువారం అందుకున్నారు. అమలాపురంలోని బుద్ధవిహార్‌లో ఆంధ్రప్రదేశ్ ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, జిల్లా సౌజన్యంతో త్రిరత్న బుద్ధ విహార్ వేదికగా జరిగిన కార్యక్రమంలో సీనియర్ ధమ్మ బోధకులు, రామ్ బోధికాశి అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షులు డీబీ లోక్ ముఖ్య అతిథులుగా హాజరై ఆయనకు అవార్డును అందజేశారు. ఆయనను ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు అభినందించారు.

అన్నసమారాధన

కొత్తపేట: మండలంలోని వానపల్లి బాల గణపతి ఉత్సవ పందిరిలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ తోరాటి లక్ష్మణమూర్తి నాయుడు, సభ్యులు కుంపట్ల చిన్నకాపు, పోతుల రామారావు, రత్నాకర్, గొలకోటి పళ్లంరాజు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. వానపల్లి, చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఆలయానికి మైక్‌సెట్ అందజేత

ఆలమూరు: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జవహర్‌లాల్ నెహ్రూ, వీర వెంకట నాగలక్ష్మి దంపతులు రూ.22 వేలు విలువైన మైక్‌సెట్‌ను గురువారం అందజేశారు. నవ జనార్దనస్వామి ఆలయాల్లో ప్రముఖమైన ఈ ఆలయంలో అనునిత్యం జరిగే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగించే మైక్‌సెట్‌ను సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

అధ్యాపకుల దీక్షకు ఏడాది పూర్తి

మలికిపురం: మండలంలోని ఎంవీఎస్‌జెఎస్, ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ఆధ్యాపకులు తమ ఉద్యోగ భద్రత, జీతాల కోసం చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి ఏడాది పూర్తైనా ఇంకా సమస్య పరిష్కారం కాలేదు. గతేడాది సెప్టెంబరు 11న తమ జీతాలను సక్రమంగా చెల్లించాలని యాజమాన్యాన్ని, అప్పటికే పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతం చెల్లించకపోగా పోలీసులతో రోడ్డు మీదకి నెట్టేయడంతో అధ్యాపకులు దీక్షలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పలువురు గురువారం దీక్షా శిబిరానికి చెవ్వాకుల సూర్యప్రకాశరావు, నేతల నాని, తాడి రవీంద్ర, పమ్మి ప్రసాద్, తాడి సహదేవ్, చింతా రాజబాబు, కొల్లాబత్తుల అశోక్, నల్లి శివ, మాజీ సర్పంచ్ రాపాక సత్యనారాయణ 24 మంది అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది వచ్చి మరోసారి వారికి సంఘీబావం తెలిపారు. దీక్షలో కూర్చున్న అధ్యాపకులకు మద్దతు తెలిపి యాజమాన్యం తగిన విధంగా స్పందించాలని కోరారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

రాజోలు: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాజోలు కోర్టు ప్యానల్ అడ్వకేట్ దివ్వి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన జాగృతి పథకంపై అవగాహన కల్పించారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందే విధంగా చూడాలన్నారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏఓ సత్యనారాయణ, పారా లీగల్ వలంటీర్లు కె.సురేంద్రకుమార్, ఎస్.మహలక్ష్మి పాల్గొన్నారు.

తెలగ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

మామిడికుదురు: ది రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల శాఖ సమావేశం గురువారం మామిడికుదురు దీప్తి విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వన్నెంరెడ్డి సాయిబాబా, యెరుబండి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిక్కం రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా వలవల ఏడుకొండలు, గౌరవ సలహాదారులుగా వెంకట నాగభూషణం, తోట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కొమ్ముల సూర్యనారాయణ, అదనపు కార్యదర్శిగా యెరుబండి వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని నిర్ణయించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మామిడికుదురు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నిరంజని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మట్టా నాగరాజును మామిడికుదురు జెడ్పీ హైస్కూల్లో గురువారం సత్కరించారు. హెచ్‌ఎం బొందాడ చిరంజీవి అధ్యక్షతన సన్మాన సభ జరిగింది. ప్రస్తుతం కాట్రేనిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న నిరంజని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు అన్నారు. మట్టా నాగరాజు కలెక్టర్ మహేష్‌కుమార్ ద్వారా అవార్డు అందుకోవడం కూడా హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈఓ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న పురస్కారాల అందజేత

మామిడికుదురు: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న 2024– 2025వ సంవత్సరంలో ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహరరాజు గురువారం తెలిపారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో శనివారం ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, మొమెంటోలు అందిస్తామన్నారు. ఉపాధ్యాయులను సన్మానిస్తామని చెప్పారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కొత్తపేట: మండలంలో పాత రేషన్ కార్డుల స్థానంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం స్థానిక కమ్మిరెడ్డిపాలెంలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో ఆర్డీఓ శ్రీకర్ ప్రారంభించారు. స్మార్ట్ కార్డులను పలువురు వినియోగదారులకు అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ, మండలంలో 46 చౌకధరల దుకాణాలకు సంబంధించి 23,447 రేషన్ కార్డులు ఉండగా.. కొత్తగా 410 కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం 23,888 నూతన స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభించామన్నారు. కార్డుదారులు సంబంధిత రేషన్ షాపు డీలర్ వద్దకు వెళ్లి డిజిటల్ బియ్యం కార్డును ఈ–కేవైసీ ద్వారా తీసుకోవాలని కోరారు.

ఆత్రేయపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాజేశ్వరరావు ప్రారంభించారు.

అంబాజీపేట: మాచవరంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ కార్డులను సర్పంచ్ శాంతకుమారి అధ్యక్షతన గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.